
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8, కనిష్ఠం 23.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
3
గురువారం 4 జూలై 2024





ఇక జడ్పీ.. ఖాళీ

- నేటితో ముగియనున్న జడ్పీ పాలకవర్గ పదవీ కాలం
- మూడేళ్లుగా ఉప ఎన్నికలు నిర్వహించకుండానే ముగిసిన పాలన
- ఇక నుంచి జడ్పీకి ఇన్‌చార్జిగా కొనసాగనున్న జిల్లా కలెక్టర్
- మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారుల నియామకం
- స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం

ఆదిలాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండల పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం బుధవారంతో ముగియగా.. జడ్పీటీసీల పాలకవర్గాల పదవీ కాలం గురువారంతో ముగియనుంది. పంచాయతీల మాదిరిగానే జడ్పీ, మండల పరిషత్ పాలన ప్రత్యేకాధికారులతో సాగనుంది. కాగా, జూలై 4వ తేదీతో ప్రత్యేకాధికారులకు పాలన బాధ్యతలను అప్పగించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల వరకు ప్రత్యేక అధికారులే ఇన్‌చార్జీలుగా కొనసాగుతారు. గతంలో మాదిరిగానే పరిషత్‌ల పాలన యధావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 18 మండలాలకు గాను అర్బన్ మండలం మినహా 17 మంది జడ్పీటీసీలు, ఆయా మండలాల పరిధిలో 158 మంది ఎంపీటీసీల పదవీకాలం గురువారంతో ముగిసింది. ఇన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా కొనసాగిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాజీలుగా మారనున్నారు. ఇప్పటికే పంచాయతీల పాలన ఫిబ్రవరి 2తో ముగిసింది. అయినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించక పోవడంతో ప్రత్యేకాధికారులతోనే నెట్టుకొస్తున్నారు. అదేమాదిరిగా జడ్పీ, మండల పరిషత్‌ల పాలనను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గడిచిన ఐదేళ్లలో జడ్పీ, మండల పరిషత్‌లకు సరిపడా నిధులు మంజూరుకాక పోవడంతో అభివృద్ధి అంతంతమాత్రంగానే కనిపిస్తుంది. ప్రతీసారి సర్వసభ్య సమావేశాలలో సమస్యలపై సభ్యులు నిలదీసిన పరిష్కారం కనిపించ లేదు. దీంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిపోవడంతో జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపఎన్నికల ఊసెత్తని ప్రభుత్వం

2019 జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో గెలుపొందిన పలువురు సభ్యులు మరణించడం, కొందరు పదవికి రాజీనామా చేయడంతో పలు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో ఉపఎన్నికలు నిర్వహించకుండానే ప్రభుత్వం పాలనను నెట్టుకొచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖాళీ అయ్యాయి. అయినా గత ప్రభుత్వం ఉపఎన్నికల ఊసెత్త లేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడిచిన ఉప ఎన్నికల జోలికి వెళ్లలేదు. దీంతో ఉప ఎన్నికలు లేకుండానే జడ్పీ, మండల పరిషత్‌ల పదవీ కాలం ముగిసిపోయింది. కరోనా సమయంలో జడ్పీ వైస్ చైర్మన్ ఆరే రాజన్న ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో గత మూడేళ్లుగా ఆదిలాబాద్ జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనే లేదు. అదేవిధంగా గత యేడాది క్రితం జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థులను కూడా ప్రకటించాయి. అయినా మళ్లీ ఉప ఎన్నికను ప్రభుత్వం వాయిదా వేసింది. గత ఆరు మాసాల క్రితం నేరడిగొండ జడ్పీటీసీ సభ్యుడు అనిల్‌జాదవ్ బోథ్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ మండల జడ్పీటీసీ స్థానం కూడా ఖాళీ ఏర్పడింది. అలాగే ఇచ్చోడ, గుడిహత్నూర్, ఉట్నూర్ మండలాల్లో ముగ్గురు ఎంపీటీసీలు మరణించారు. అయిన ప్రభుత్వం ఉప ఎన్నికలను నిర్వహించేందుకు ఆసక్తిని చూపించ లేదు. దీంతో మూడేళ్లుగా వైస్ చైర్మన్ లేకుండానే జడ్పీ పాలకవర్గ పదవి కాలం ముగిసి పోయింది.



జిల్లా పరిషత్ కార్యాలయం

పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

జడ్పీ, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. జడ్పీకి జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు. ఆయా మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించి మునుపటి మాదిరిగానే పాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేకాధికారులను నియమించనున్నారు. ఎన్నికల వరకు ప్రత్యేకాధికారులే పరిషత్‌లకు ఇన్‌చార్జీలుగా కొనసాగుతారు. అయితే ప్రజాప్రతినిధుల పాలనలో పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను ప్రత్యేకాధికారులు ఎలా పరిష్కరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లోను సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి పోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా పారిశుధ్య సమస్య అధికారులకు సవాలుగా మారనుంది. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, వర్షాలు, భారీ వరదలతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అలాగే గ్రామీణ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవస్థలు తప్పవంటున్నారు. వీటికి తోడు సంక్షేమ పథకాల అమలు, నిధుల మంజూరులో జాప్యంతో ప్రత్యేకాధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు.

ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే..

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఎందుకంటే వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో కోడ్ అమల్లో ఉండడంతో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆటంకంగా మారింది. దీంతో పంచాయతీల పదవీ కాలం ఫిబ్రవరితో ముగిసిన ప్రత్యేకాధికారులతోనే పాలనను నెట్టుకొస్తుంది. అలాగే జడ్పీ, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించి పాలనను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. దీంతో ఇప్పట్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతు రుణమాఫీ పథక అమలుతో పాటు బీసీ జనాభా గణన పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా ఆగస్టు నెల వరకు రుణమాఫీ పూర్తి చేసి సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రిజర్వేషన్లను ఖరారు చేసి నవంబరు, డిసెంబరు వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే అవకాశం కనిపిస్తుంది. గత కొద్దిరోజులుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఆశావహ నేతలకు నిరాశ కనిపిస్తుంది.

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు వీరే..

ఆదిలాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 మండలాలకు గాను అర్బన్ మండలం మినహా 17 మంది జడ్పీటీసీలు, ఆయా మండలాల పరిధిలో 158 మంది ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది. ఇన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా కొనసాగిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాజీలుగా మారనున్నారు. పంచాయతీల మాదిరిగానే జడ్పీ, మండల పరిషత్ పాలన ప్రత్యేకాధికారులతో సాగనుంది. కాగా, జూలై 4వ తేదీతో ప్రత్యేకాధికారులకు పాలన బాధ్యతలను అప్పగించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. వివరాలిలా..

మండలం	అధికారి	సెల్ నెం.
1. ఎంపీపీ ఆదిలాబాద్‌రూరల్	పద్మభూషణ్‌రాజ్	9440295143
2. ఎంపీపీ బజార్‌హత్నూర్	బి.మోహన్	9100115638
3. ఎంపీపీ బేల	ఎన్.శంకర్	7032312008
4. ఎంపీపీ భీంపూర్	బి.కిషన్	7337396420
5. ఎంపీపీ బోథ్	టి.కిరణ్‌కుమార్	8008301411
6. ఎంపీపీ ఇచ్చోడ	డి.పుల్లయ్య	7288894000
7. ఎంపీపీ గాదిగూడ	ఎల్.జివాకర్‌రెడ్డి	9908606100
8. ఎంపీపీ గుడిహత్నూర్	సునిత	9441424004
9. ఎంపీపీ ఇంద్రవెల్లి	జి.సాయన్న	8978633585
10. ఎంపీపీ జైనథ్	వై.సాంబశివరావు	94943197158
11. ఎంపీపీ మావల	కె.రాజలింగు	9848950512
12. ఎంపీపీ నార్నూర్	గంగాధర్	9440387100
13.ఎంపీపీ నేరడిగొండ	ఆర్.రవీందర్	7013105316
14. ఎంపీపీ సిరికొండ	టి.వినోద్‌కుమార్	9848191828
15. ఎంపీపీ తలమడుగు	శ్రీనివాస్	7330733147
16. ఎంపీపీ తాంసి	బి.వెంకటరమణ	9948986104
17. ఎంపీపీ ఉట్నూర్	దిలీప్‌కుమార్	9490957034



మాట్లాడుతున్న జేడీఏ పుల్లయ్య

రైతు భరోసా పథకంపై అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేస్తాం : జేడీఏ

జైనథ్, జూలై 3: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణను నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ బాలూరి గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ కొండలు, గుట్టలు, జాతీయ రహదారులు, రియల్ ఎస్టేట్, వాగులు చెరువులకు రైతు భరోసా పథకం వర్తింప చేయవద్దన్నారు. సాగు భూములకే పది ఎకరాల వరకు ఎకరానికి రూ.15 వేల చొప్పున అందించాలని సూచించారు.

- సాగు భూములకు రైతుభరోసా అమలు చేయాలి : పి.గణేష్ యాదవ్, మండల రైతు నాయకుడు

రాష్ట్రం ప్రభుత్వం రైతులు సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా పథకం ద్వారా రూ.15వేలు చెల్లించాలన్నారు. రైతులకు పెట్టుబడి సహాయాన్ని సకాలంలో అందించాలన్నారు. కొండలు గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములను రికార్డులల్లో నుంచి తొలగించాలన్నారు. ఇందులో ఎంపీపీ ఎం.గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతిరెడ్డి, వైస్ ఎంపీపీ ఎస్.విజయ్ కుమార్, మాంగర్లు ఎంపీటీసీ పి.దేవన్న, కె.సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో అవగాహన కల్పిస్తున్న సైబర్‌క్రైమ్ పోలీసులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- సైబర్ క్రైమ్ డీఏస్పీ హసీబులా

ఇచ్చోడ, జూలై 3: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సైబర్ క్రైమ్ డీఏస్పీ హసీబులా పోలీసు అధికారులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా దుష్పరిణామాలు, సైబర్ రక్షణ, 1930 ప్రాముఖ్యత, నేరాలు వాటి నుంచి ఎలా రక్షణ పొందాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులను ఎవరైనా వేధించినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ భీమేష్, ఎస్సై నరేష్, షీటీం బృందం సభ్యులు వాణీ, బాగ్య, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రసాద్, మోహన్, సంతోష్, ప్రకాష్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి : ఏబీవీపీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 3: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయని పక్షంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేకాకుండా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, జూలై 3: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బండి దత్తాత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నూతన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

'పంచాయతీలు, స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 3: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసే పరిస్థితి కనిపిస్తోందని, కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా.. గ్రామ పంచాయతీలలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ వచ్చిందని ఆరోపించారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను గ్రామాలాభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్

- మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు గులాబీ కౌన్సిలర్లు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 3: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు మరోషాక్ తగిలింది. వైస్ చైర్మన్‌పై అవిశ్వాస ప్రయత్నాలు కొనసాగుతున్న సమయంలోనే ఊహించని విధంగా బీఆర్ఎస్‌కు ఆ పార్టీ కౌన్సిలర్లు గుడ్‌బై చెబుతున్నారు. బుధవారం మరో ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీని వీడి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ ఆదిలాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 45వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు బండారు సతీష్, 44వ వార్డు కౌన్సిలర్ షహనాజ్ బేగం తనయుడు ఇమ్రాన్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లు మాట్లాడుతూ జోగురామన్న, పాయల శంకర్‌ల తీరుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కంది శ్రీనివాస్ నాయకత్వంలోనే సాధ్యమని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, నాయకులు డేరా కృష్ణారెడ్డి, అఖిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు పచ్చదనాన్ని అందించాలి : ఎంపీపీ

బోథ్, జూలై 3: మండలకేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల వారి కోసం స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ అందడంతో పాటు ప్రకృతిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పీవో ఖుష్బుగుప్త
- ఉట్నూర్ బాలుర ఆశ్రమ పాఠశాల తనిఖీ
- ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్న పీవో



తరగతి గదిలో విద్యార్థులకు బోధన తీరును పరిశీలిస్తున్న పీవో



వంట పాత్రలు, వండిన పదార్థాలను పరిశీలిస్తూ..

ఉట్నూర్, జూలై 3: ఉమ్మడి జిల్లాలో ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పీవో ఖుష్బుగుప్త గుబులు పుట్టిస్తున్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల దాటుతున్నందున విద్యార్థులు హాజరు శాతం పెంచుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలను ఏదో ఒకచోట ప్రతిరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండడంతో ప్రాజెక్టు అధికారి ఎప్పుడు ఎక్కడికి వస్తారోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పీవో ఎప్పుడైనా తమ పాఠశాలకు రావచ్చు అని భావిస్తున్న పాఠశాలల సిబ్బంది సమయానుసారం పాఠశాలలకు చేరుకుంటున్నారు. మొదటిసారిగా పాఠశాలల సందర్శనకు వెళ్తున్న పీవో సూచనలు సలహాలు అందిస్తూ ఎలాంటి చర్యలు తీసుకోక పోతుండడంతో ఉపాధ్యాయులు కొందరు పీవో తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తరుచు పర్యవేక్షణ చేస్తూ ఉంటే ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు అవుతారని పరిశీలకులు అంటున్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఇన్‌చార్జీ వార్డెన్ రాములు, హెచ్‌ఎం మేస్రం గంగారాంలనువివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యబోధన చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఎలాంటి మరమ్మతులు చేపట్టనందున వర్షాలకు నిబద్ధంలో వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ జాతీయ రహదారిపై కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎస్పీ

జాతీయ రహదారిపై వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి : ఎస్పీ

ఇచ్చోడ, జూలై 3: మండల కేంద్రంలోని దుబార్‌పేట్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సూచించారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సోమ కంపెనీ మేనేజర్ సుకుమార్‌కు సూచించారు. ఇప్పటికే ఒకవైపు వంతెన నిర్మాణం పూర్తయిందని 15రోజుల్లో అవతలి వైపు వంతెన నిర్మాణం ప్రారంభిస్తామని వరదనీటి ఇబ్బందులు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టనున్నట్లు సోమ కంపెనీ మేనేజర్ వివరించారు. అనంతరం జాతీయ రహదారిపై నుంచి వంతెన పనులను పర్యవేక్షించారు. అంతకు ముందు ఇచ్చోడ పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన పోలీస్ రిసెప్షన్ గదిని పరిశీలించారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ భీమేష్, ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలతో చిరకాల గుర్తింపు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, జూలై 3: రాజకీయాలు వేరు.. ప్రజా సేవ వేరు.. ప్రజలకు ఉత్తమంగా సేవలందిస్తే ఎవరైనా చిరాకలం ప్రజల గుండెల్లో నిలిచిపోతారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ, జడ్పీటీసీ, కోఆప్షన్, ఎంపీటీసీల ఆత్మీయ సన్మానం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవికే పదవీ విరమణ అని, ప్రజల సేవకు కాదని అన్నారు. ఐదేళ్లుగా ఎంపీటీసీలు పార్టీలకతీతంగా ప్రజాహితం కోసం పని చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ పుష్పలతా, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, జడ్పీ కోఆప్షన్ అంజద్, మండల కోఆప్షన్ మిర్జా జిలానీ బేగ్, ఎంపీటీసీలను సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఎంపీపీ పాలకవర్గం పక్షానా సన్మానించారు. ఇందులో ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల్లో

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బాసర, జూలై 3 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 95 శాతం మంది సర్కారు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ట్రిపుల్ ఐటీ ఎంపిక జాబితాను అధికారులు విడుదల చేశారు. 1500సీట్లకు గాను ప్రత్యేక కెటగిరీ 96 సీట్లు వదిలేసి.. మిగితా 1404 సీట్లను ప్రకటించారు. ఎంపికైన విద్యార్థుల్లో 976 మంది బాలికలు, 428 మంది బాలురు ఉన్నారు. ఇందులో 95 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ వివిధ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ప్రతీ రిజర్వేషన్ కెటగిరీలో 9.6 లేదా అంతకంటే ఎక్కువ పదవ తరగతిలో జీపీఏ సాధించిన వారే ఎంపికయ్యారు. 1500ల సీట్లకు 15000 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలో అత్యధికంగా సిద్దిపేట జిల్లా నుంచి 330, అత్యల్పంగా వనపర్తి జిల్లా నుంచి ఒక్కరే ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 8, 9, 10 వ తేదీల్లో కౌన్సిలింగ్ ఉంటుంది. ప్రకటించని 96 ఎన్‌సీసీ, క్యాప్, స్పోర్ట్స్, ఫిజికల్లీ చాలెంజ్డ్‌కు సంబంధించిన సీట్లను జూలై 4, 5 తేదీల్లో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఎంపిక చేయనున్నారు.


ఎంపిక జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

'నాన్ టీచింగ్ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలి'

నిర్మల్ అర్బన్, జూలై 3 : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి డీఈవో రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ.. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌తో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోడికూతతో పనులు ప్రారంభించి రాత్రి 8 గంటల వరకు వారు విధులు నిర్వహిస్తుంటే వారి బాధలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కే. లక్ష్మీ, జిల్లా కార్యదర్శి కవిత, జయసుధ, పార్వతి, లక్ష్మీ నర్సమ్మ పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ పెంపును వెంటనే ప్రకటించాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

నిర్మల్ టౌన్, జూలై 3 : వికలాంగుల పెన్షన్ పెంపును వెంటనే ప్రకటించాలని, పెన్షన్ పెంపు చేయకపోతే సీఎం ఇళ్లను ముట్టడిస్తామని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం నిర్మల్ జిల్లాలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు 4 వేల నుండి 6 వేలు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు 2 వేల నుండి 4 వేల పింఛన్ పెంచుతామని చెప్పి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తెలంగాణలో మహిళలకు ఏవిధంగా ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసే విధంగా చేశారో దివ్యాంగులకు కూడా ఉచితంగా ప్రయాణించే విధంగా కృషి చేయాలని, రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ (పీహెచ్‌డీ) వయసు, నెట్ నుంచి వికలాంగులందరికీ మినహాయింపు ఇవ్వాలని, శారీరక వికలాంగుల రోస్టర్ 56ని 10 లోపు మార్చాలని ప్రస్తుతం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాలలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇట్టి సమస్యల పరిష్కారం కోసం మందకృష్ణ మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమం కోసం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వికలాంగుల అడా కమిటీ సభ్యులు నూకల నిషిత, తీగల కళావతి, కోటికల్ వినోద్, నిర్మల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి మాదిగ, ఎంఎస్పీ నియోజకవర్గం ఇంచార్జీ కులగని రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ నిర్మల్ మండల అధ్యక్షుడు నామత్కార్ లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సారంగాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, వికలాంగులు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి'

నిర్మల్ టౌన్, జూలై 3 : ఏబీవీపీ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని స్థానిక అంబేద్కర్ చౌక్ నుండి వివేకానంద చౌక్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి. శివ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉన్న విడుదల చేయడం లేదన్నారు. మరి అలాగే గత మూడు సంవత్సరాల నుండి స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులకు కాలేజీలలో స్కాలర్షిప్‌లు రాక కళాశాల యాజమాన్యం ఫీజులు కట్టాలని ఇబ్బందికి గురిచేస్తున్నాయి. అలాగే విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. కాబట్టి ఇప్పటికైనా వెంటనే స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్, సన్ని, లక్ష్మణ్, సాయి, సిద్ధు, విఘ్నేష్, రాజేందర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

భైంసా రూరల్, జూలై 3 :భైంసా పట్టణంలోని ఆశ్రమ పాఠశాలను బుధవారం స్పెషల్ ఆఫీసర్ రాములు సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం, శానిటేషన్ పరిశీలించడానికి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం వివరాలు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనంతో పాటు పరిసరాల ప్రాంతం శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భోజరాం, వార్డెన్ కవిత, సీనియర్ అసిస్టెంట్ సురేష్, చంద్ర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

భైంసా రూరల్, జూలై 3 : వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లోని, వార్డుల్లో ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. హరిత హారంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోజాం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

పెంబి రూరల్, జూలై 3 :ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ఎంపీపీ, ఎంపీటీసీ, కోఆప్షన్ పదవీ కాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు చేసిన ఐదు సంవత్సరాల పదవి కాలంలో అభివృద్ధి, అనుభూతి అందరితో పంచుకున్నారు. అనంతరం వారికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమాకాంత్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు చెట్లు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఎంపీటీసీ, ఎంపీపీ, కోఆప్షన్ పదవి కాలం ముగిసిందన్నారు. వీరు రాబోయే కాలంలో మంచి పదవిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత గోవింద్, జడ్పీటీసీ జానుబాయి, వైసీపీ గంగారెడ్డి, ఎంపీటీసీ గోదావరి నరేందర్, రామారావు, ఎంపీవో రత్నాకర్ రావు, తహసీల్దార్ లక్ష్మణ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు ప్రజా సేవే ముఖ్యం

● కుంటాల ఎంపీపీ

కుంటాల, జూలై, 3: ప్రజా ప్రతినిధులకు పదవి ముఖ్యం కాదు.... ప్రజా సేవ చేయడం ముఖ్యమని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం కుంటాలలో ఎంపీపీ అప్క గజ్జారాంతో పాటు పలు ఎంపీటీసీల పదవి కాలం ముగిసినందున వారికి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా ప్రజా ప్రతినిధులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాలుగా ఎంపీపీ, ఎంపీటీసీలు ప్రజలకు సేవలందించిన తీరును పలువురు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, ఏవో సోమలింగా రెడ్డి, ఏపీవో నవీన్‌తో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

కల్లూర్‌లో ఆపరేషన్ ముస్కాన్

కుంటాల, జూలై, 3 : మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపార సంస్థల్లో కార్మికుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌ఐ నారాయణ్ సింగ్, న్యాయవాది నరేందర్, సామాజిక కార్యకర్త మమత, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సయ్యద్, డబ్ల్యూటీసీ హరీష్, అనుప్రియ పాల్గొని 17 సంవత్సరాలు నిండని వారిని హోటళ్లు, దుకాణాలలో పనిలో చేర్చుకుంటే వారిని, వారి తల్లిదండ్రులకు కఠిన చర్యలుంటాయని భైంసా డివిజన్ న్యాయ సలహాదారు షేర్ నరేందర్ అన్నారు. కల్లూరులో జరిగిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా వివిధ దుకాణదారులకు బాలకార్మికులను పనిలో చేర్చుకుంటే చర్యలుంటాయన్నారు.

మందపల్లి కేజీబీవీ పాఠశాలలో బోరు ఏర్పాటు

పెంబి రూరల్ , జూలై 3 : ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక.. ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగుపాటు కాదు.. అంతర్గత లోపమే!

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. అయితే దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా ఓ నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! బాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.


నివాళులర్పిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, తదితరులు

దివంగత మాజీ ఎంపీకి ఘన నివాళి

ఉట్నూర్, జూలై 3: దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ చిత్రపటానికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నివాళులర్పించారు. బుధవారం మండలకేంద్రంలోని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రమేష్ తనయులు రితేష్ రాథోడ్, రాహుల్ రాథోడ్‌తో పాటు సతీమణి మాజీ ఎమ్మెల్యే సుమన్ బాయి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాథోడ్ రమేష్ పార్టీ కోసం ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి ప్రజలకు బీజేపీకి తీరని లోటని అన్నారు. ఇదిలా ఉండగా.. కొత్తపల్లి దీక్షభూమి బంజారా గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంతో ముందుకు వెళ్లాలని, ఆయన చూపిన బాటలో సామాజిక సేవలు, సంఘ సేవలు చేయాలని సూచించారు. రాథోడ్ రమేష్ చిన్నాన్న రాథోడ్ మధుకర్, రాథోడ్‌నారాయణ, జాదవ్ గోపాల్‌రావు, రెడ్డిజాదవ్, గుగులావత్ శ్రీరామ్ నాయక్, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యతతోనే జైనథ్ సమగ్ర అభివృద్ధి'

జైనథ్, జూలై 3: పార్టీలకు అతీతంగా ఐక్యతతోనే మండల సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఎం.గోవర్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో ఎంపీపీ ఎంపీటీసీల పదవి విరమణ సందర్భంగా అధికారులు, నాయకులు ప్రజా ప్రతినిధులతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఊశన్న, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు పి.దేవన్న, గిమ్మా ఎంపీటీసీ కోల భోజన్న, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, సూపరింటెండెంట్ ముత్యం రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రాజకీయాలలో పదవీ విరమణ ఉండదు'

నేరడిగొండ, జూలై 2: రాజకీయ నాయకులకు ప్రజలకు సేవచేయడంలో పదవీ విరమణ లేదని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఎంపీడీవో రాజ్‌వీర్‌లు అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల పరిషత్ పాలకవర్గ సభ్యులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీటీసీలను తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రజలకు అధికారుల మన్ననలు పొందారని, రానున్న కాలంలో మరిన్ని పదవులు అధిరోహించి ప్రజాసేవ చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ రాథోడ్ సజన్ మాట్లాడుతూ.. ఈ ఐదేళ్ల మండల అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గ సభ్యులతో కలిసి పని చేశామన్నారు. ఇందులో ఎంపీవో లక్ష్మణ్, ఏపీఎం ఉత్తం, ఏపీవో వసంత్‌రావు, సూపర్ వైజర్ మంజుల, డాక్టర్‌సద్దాం, ఏఈ పిరాజ్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


నేరడిగొండలో మండల పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

విద్యుత్ కోతలపై సభ్యుల ఆగ్రహం

- వాడివేడీగా ముగిసిన బోథ్ మండల సర్వసభ్య చివరి సమావేశం
- హాజరైన ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు


సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

బోథ్, జూలై 3: బోథ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం వాడివేడీగా జరిగింది. సమావేశం చివరిది కావడంతో సమావేశానికి ఎంపీటీసీలతో పాటు పాటు జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్ మండల ఉపాధ్యక్షుడు బాబులాల్, ఎంపీడీవో రమేష్‌తో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో విద్యుత్ కోతలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తపరిచారు. విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్నాయన్నారు. అంతేగాక ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని పంట రుణమాఫీపై వాయిదాలు వేస్తుందని సభ్యులు వాపోయారు. వర్షాకాలంలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి తగు సూచనలు చేయాలని కోరారు. సమావేశం రైతుబంధు రైతు రుణ మాఫీ, విద్యుత్ కోతలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కాగా సమావేశంలో తాగునీటి సరఫరాపై చర్చ కొనసాగింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటి పైప్‌లకు లీకేజీలు ఉన్నాయని, వాటిని పూడిచివేయాలని సభ్యులు కోరారు. స్పందించిన ఏఈ కల్యాణ్ మాట్లాడుతూ తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ వారికి వివరిస్తామన్నారు. సమావేశంలో ఎంఈవో భూమారెడ్డి, ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని రిలీవర్ రాకుంటే ఇక్కడ నుంచి ఉపాధ్యాయులను విడిచిపెట్టేది లేదని వివరించారు. కాగా, ఎంపీపీ కల్పించుకుని విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీడీపీవో సౌందర్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు గాను కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణ పూర్తి కాగానే పాఠశాలల తరహాలో కేంద్రాల నిర్వహణ ఉంటుందని వివరించారు. ఉపాధిహామీ ఏపీవో జగదేరావు మాట్లాడుతూ ప్రభుత్వం కూలి రేట్లు పెంచడంతో పాటు ఉపాధిహామీ పనులను వేగవంతం చేపట్టడం వల్ల ఈ ఏడాది కూలీల సంఖ్య పెరిగిందన్నారు. అంతేగాక ప్రతీ వారం కూలీ డబ్బులు పడటంతో కూలీలు ఉత్సాహంగా పని చేయడం జరిగిందన్నారు. ఇందిరాక్రాంతి ఏపీఎం మాధవ్ మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా ముందు ఉంచేందు కు గాను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని, అంతేగాక మండలంలోని దన్నూర్ గ్రామంలో మహిళా సమాఖ్యకు మీ సేవా కేంద్రాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు తీసుకున్న వారు తిరిగి చెల్లించే విధంగా సహకారం అందించాలని సభ్యులను కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి డీఈ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో తమకు సరైన సిబ్బంది లేకున్నా రోడ్లను మెరుగుపరుస్తున్నామన్నారు. ఇప్పటికే బోథ్ సమీపంలోని కరెంట్ వాగు వంతెన పూర్తి చేసి రహదారి సౌకర్యం కల్పించామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో నిధులు మంజూరు అయితే మరిన్ని రహదారులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎస్సీఆర్పీ విఠల్‌రావు మాట్లాడుతూ నాలుగు ఆశ్రమాలు ఉన్నాయని, వివిధ పాఠశాలల్లో 912 మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. విద్యార్థులు లేక లక్ష్మీపూర్, సుర్దాపూర్ పాఠశాలలు మూతపడ్డాయని ఆయన వివరించారు.


మొక్కలు నాటుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

'రిమ్స్‌లో వెయ్యి మొక్కలు నాటుతాం'

ఆదిలాబాద్ రూరల్, జూలై 3: జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో వెయ్యి మొక్కలు నాటేలా లక్ష్యం పెట్టుకున్నామని, ఆస్పత్రిని గ్రీన్ ఛానల్‌గా మారుస్తామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. బుధవారం స్థానిక రిమ్స్ క్వార్టర్స్‌లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. రిమ్స్‌లో పచ్చదనం పెంపొందించడానికి ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిమ్స్‌లో పచ్చదనం పెంచడం కారణంగా ఇటీవల గ్రీన్ ఛానెల్ అవార్డు కూడా వచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మొదటి క్రానియోటమీ శస్త్రచికిత్స

ఆదిలాబాద్ రూరల్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మొదటి క్రానియోటమీ శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా చేశారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రోహన్(25) బైక్‌పై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రిమ్స్ ఆస్పత్రి లో చేర్పించగా.. మెదడులో రక్తం గడ్డ కట్టుకపోయి తల ఎముకలు దెబ్బ తిన్నట్లు డాక్టర్లు గుర్తించారు. దీంతో మొదటిసారి రిమ్స్‌లో క్రానియోటమీ శస్త్ర చికిత్స చేయగా.. రోగి కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు.

పొచ్చెర పాఠశాలలో కోతుల దాడి

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు

బోథ్, జూలై 3: మండలంలోని పొచ్చెర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులపై కోతులు దాడి చేశాయి. దాడి లో ఆరవ తరగతి చదువుతున్న హైట్ల చరిత, మూడవ తరగతి చదువుతున్న సుస్మితలకు గాయాలయ్యాయి. పాఠశాల ఆవరణలో విద్యార్థులు బయటకు వెళ్లగానే కోతులు దాడి చేశాయి. దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో గాయాలపాలైన వారిని బోథ్ ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం చేయించారు. కాగా గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలి : బీజేపీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 3: మహాలక్ష్మి పథకంతోపాటు మహిళలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్లాస్టిక్ రహిత దినోత్సవం

ఉట్నూర్, జూలై 3: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుటకు ప్రతీఒక్కరు కృషి చేయాలని యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ హెచ్ఆర్‌డీ మర్సుకోల తిరుపతి అన్నారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్లాస్టిక్ రహిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి మంగం విషంరావు, వైట్ యూత్ అధ్యక్షుడు సాజిద్‌సిద్దికి, కేజీబీవీ ఇన్‌చార్జీ స్పెషల్ ఆఫీసర్ పెందూరు సావిత్రి బాయి, ఆత్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

ప్రజా సేవ చేసే వారికి పదవీ విరమణ ఉండదు : జడ్పీటీసీ

తలమడుగు, జూలై 3: నిరంతరం ప్రజాసేవ చేసే వారికి పదవీ విరమణ ఉండదని తలమడుగు జడ్పీటీసీ గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిషత్ కార్యాలయం తరపున ప్రజాప్రతినిధులకు ఘనంగా వేడుకలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు శాశ్వతం కావని, పదవీ కాలంలో ప్రజలకు చేసిన మంచి, శాశ్వతంగా నిలుస్తుందని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం అధికారంలో లేకున్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మండల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా సమన్వయంతో మండలాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో మరింత ముందుకు వెళదామన్నారు. అనంతరం అధికారులు పదవీ విరమణ పొందిన ఎంపీపీ కల్యాణలక్ష్మీ రాజేశ్వర్లను, ఎంపీటీసీలను మాజీ సర్పంచ్‌లను శాలువాలతో మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి దూదిరాం రాథోడ్, పీఆర్ఏఈ మదర్, మాజీ జడ్పీటీసీ బాపన్న, ఏపీవో మేఘమాల, సూప రింటెండెంట్ జమీల్, ఎంపీవో వినోద్, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులకు ఘనంగా వీడ్కోలు

మావల, జూలై 3: పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో మండల ప్రజా ప్రతినిధులకు ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దర్శనాల సంగీత, జడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్‌లతో పాటు వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరి, కో ఆప్షన్ మెంబర్ రహీంఖాన్‌లను అధికారులు సన్మానించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సర్పంచ్, ఎంపీటీసీలు మండల అధికారులు అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. ఇందులో మండల ప్రత్యేకాధికారి రాజలింగు, ఎంపీడీవో శంకర్, ఎంపీవో శోభ, ఏపీవో రజిని, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, హేమలత, నాయకులు రాగం గోవర్ధన్, రాజన్న, కారోబార్ దశరథ్, సిబ్బంది, తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి : ఎంపీపీ

భీంపూర్, జూలై 3: తమ పదవి కాలం ముగిసిందని నిశ్శబ్దంగా ఉండకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమవంతుగా కృషి చేస్తానని ఎంపీపీ కుడిమేత రత్న ప్రభ సంతోష్ అన్నారు. బుధవారం భీంపూర్ రైతు వేదికలో కుడిమేత రత్న ప్రభ సంతోష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ పాలకవర్గం సభ్యుల పదవీ కాలం ముగింపు సందర్భంగా ఎంపీపీ రత్న ప్రభ సంతోష్, జడ్పీటీసీ కుమ్రా సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంపీటీసీ సభ్యులను తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డిలు సన్మానించారు. ఇందులో ఎంపీటీసీలు జహూర్ అహ్మద్, తూటి భోజన్న యాదవ్, అన్నపూర్ణ, దేవమ్మ, రాకేష్ పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8। కనిష్ఠం 26.3



నిర్మల్
జిల్లా వార్తలు
6
గురువారం 4 జూలై 2024



సాగునీటి పథకాలపై నిండా నిర్లక్ష్యం

- ఇప్పటికీ పూర్తికాని సదర్మాట్
- ఏళ్ల నుంచి కొనసాగుతున్న కాళేశ్వరం హైలెవల్ కాలువల పనులు
- జిల్లాలో వేలాది ఎకరాలకు అందని సాగునీరు
- నిధుల విడుదల విషయంలో గత సర్కారు నిర్లక్ష్యం
- కొత్త సర్కారుపైనే సాగునీటి ఆశలు

నిర్మల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం అలాగే కాళేశ్వరం హైలెవల్ ప్యాకేజీ నంబర్ 27,28 కాలువల నిర్మాణాల పనులు ఏళ్ల నుంచి నత్తనడకను తలపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయకపోవడమే కాకుండా అవసరమైన మేరకు నిధులను సైతం అందించకపోవడంతో ఆర్భాటంగా ప్రారంభమైన పథకాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికి హైలెవల్ కాలువలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తికాకపోవడం, ఇప్పటి వరకు సేకరించిన భూములకు పరిహారం డబ్బులు చెల్లించకపోవడంతో ఆ పనులన్నీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగానే ఉన్నాయి. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ.676.50 కోట్లతో అంచనాలను రూపొందించారు. దానికి అనుగుణంగా ఇప్పటి వరకు రూ.320 కోట్లతో పనులు పూర్తి చేశారు. ఇందులో కేవలం భూసేకరణకు సంబంధించి రూ.120 కోట్లను వ్యయం చేశారు. అయితే సదర్మాట్ బ్యారేజీ భూసేకరణలో భాగంగా నిర్మల్ రైతులకు పరిహారాన్ని అందించారు. మరో రూ. 5.30 కోట్లను పరిహారంగా చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే పలుసార్లు ప్రాజెక్టు నిర్మాణ గడువును పొడగించగా చివరకు మరోసారి గడువును పొడగించారు. కొద్ది రోజుల క్రితం 55 గేట్ల ట్రయల్రన్ను కూడా పూర్తి చేశారు. అయితే గేట్లు ఎత్తేందుకు దింపేందు కోసం అవసరమయ్యే విద్యుత్ సౌకర్యాన్ని మాత్రం సమకూర్చలేదు. దీని కోసం రూ.13 కోట్లతో అంచనాలు రూపొందించినప్పటికీ గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడంతో విద్యుత్ పనులు ప్రారంభించలేకపోయారు. విద్యుత్ పనులు పూర్తయితేనే ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగుతాయి. సదర్మాట్ బ్యారేజీ కింద మొత్తం 18వేల ఎకరాలు సాగులక్ష్యంగా పెట్టుకోగా నిర్మల్ జిల్లాలో 13వేల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 5వేల ఎకరాల సాగును లక్ష్యంగా నిర్ధారించారు. అలాగే సదర్మాట్ బ్యారేజీ కేపాసిటీని 1.58 టీయంసీలుగా అధికారులు పేర్కొంటున్నారు. వీటితో పాటు కాళేశ్వరం హైలేవల్ ప్యాకేజీ నంబర్ 27,28 కాలువల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయని కారణంగా ఈ కాలువల పనులన్ని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం వర్షకాలం మొదలవ్వడంతో నిధులు విడుదలైన పనులు చేపట్టలేని పరిస్థితి ఎదురవుతోందని అంటున్నారు.

నిధుల విడుదలపై నిండా నిర్లక్ష్యం

కాగా సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి నిధుల విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. నిధుల మంజూరుపై ఆర్భాటమైన ప్రకటనలు చేసినప్పటికీ ఆ నిధుల విడుదల వి షయంలో మాత్రం అప్పటి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని అంటున్నారు. ఇక్కడి రైతాంగంతో పాటు ప్రజా ప్రతినిధులు ఎన్నోసార్లు నిధుల కోసం ఒత్తిడి తీసుకువచ్చినప్పటికీ స ర్కారు పెద్ద ప్రాజెక్టులకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి చిన్న ప్రాజెక్టులను పక్కన పెట్టిందన్న ఆరోపణలున్నాయి. ఇందులో భాగంగానే జిల్లాలోని సదర్మాట్తో పాటు కాళేశ్వరం కాలువలు అలాగే సరస్వతీ, గడ్డెన్న వాగు, స్వర్ణ కాలువల విషయంలో పెద్దగా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. అయితే ప్రస్తుతం ఎక్కడికక్కడ స్తంభించిపోయిన పనులతో ఈ సారి కూడా పంటలకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంటోందని అంటున్నారు.

27వ ప్యాకేజీ కాలువపై నిర్లక్ష్యం

దాదాపు 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం హైలెవల్ కాలువలపై మొదటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా స్పందన కనబర్చలేదు. అప్పట్లో మంత్రిగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్రెడ్డి ఈ కాలువల నిర్మాణ పనుల కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. ముఖ్యంగా నిధుల విడుదల విషయంలో మంత్రిగా ఎంతగా ఒత్తిడి తీసుకువచ్చినప్పటికి సర్కారు వెనకడుగు వేస్తూ వచ్చిందంటున్నారు. ఒకదశలో మంత్రి కాంట్రాక్టు సంస్థలను సైతం ఒప్పించి పనులు చేయించేందుకు సిద్ధమయ్యారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఈ దిశగా పట్టించుకోకపోవడం దాదాపు 50వేల ఎకరాల ఆయకట్టుకు శాపమైంది. అయితే చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం అడుగడుగునా కనిపిస్తోంది. చాలా చోట్ల కాలువలు, అక్విడక్ట్లు సైతం కూలిపోయాయి. చాలా చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. గుండంపెల్లి వద్ద దీనికి సంబంధించిన నిర్మించిన పంప్హౌజ్ కూడా నిరుపయోగంగా మారిపోయింది.

అస్తవ్యస్తంగా 28వ ప్యాకేజీ పనులు

కాగా కాళేశ్వరం 28వ నంబర్ ప్యాకేజీ పనులన్నీ అస్తవ్యస్తంగా స్తంభించిపోయాయి. ముథోల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ కాలువ పనులను చేపట్టారు. దాదాపు 11 సంవత్సరాల క్రితం చేపట్టిన ఈ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. మొత్తం 485 కోట్లకు గానూ ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.25 కోట్ల పనులను మాత్రమే చేపట్టింది. దీనికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఇప్పటి వరకు 111 ఎకరాలు కోల్పోయిన 93 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించలేదు. కాగా అదనంగా 400 ఎకరాల భూ సేకరణను కూడా ప్రభుత్వం క్లియరెన్స్ చేయాల్సి ఉంది. అయితే ఈ పనులు చేపట్టేందుకు గుత్తేదారులంతా చేతులెత్తేసిన నేపథ్యంలో మరోసారి టెండర్లను నిర్వహించాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికైనా సీరియస్గా దృష్టి సారించి నిధులను విడుదల చేయాలని అలాగే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ పనుల కోసం ప్రతిపాదనలు పంపాం

సదర్మాట్ ప్రాజెక్టుకు సంబంధించి పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించాం. విద్యుత్ పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. ప్రాజెక్టు వద్ద గేట్ల లిఫ్టింగ్తో పాటు ఇతర అవసరాల కోసం విద్యుత్ సదుపాయం కల్పించేందుకు రూ. 13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వాటికి ఆమోదం లభించిన వెంటనే పనులు పూర్తి చేసి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువస్తాం.

ఆర్. సురేందర్, డీఈ, సదర్మాట్ ప్రాజెక్టు

సాగునీరు అందేది ఎప్పుడో..

ప్యాకేజీ నంబర్ 28 ద్వారా సాగునీరు అందితే నా ఐదు ఎకరాల భూమి సాగులోకి వస్తది. కానీ ఏండ్లు గడుస్తున్న ఆ కాలువ పనులు పూర్తి కావడం లేదు. ఈ ప్రభుత్వమైనా త్వరితగతిన పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరుతున్నాను.

గౌతమ్, రైతు, చించాల

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ చైన్గేట్, జూలై 3 : ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, మున్సిపల్ కమిషనర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్స్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లతో ప్లాస్టిక్ నిషేధం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను వాకుండా వినియోగదారులకు విస్తృత అవగాహన క్పించాలని సూచించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ని విక్రయిస్తున్న, నిల్వ చేస్తున్న వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ను వినియోగించడం, విక్రయించే దుకాణాదారులకు జరిమానాలు విధించడంతో పాటు కేసులే నమోదు చేయాలని, వ్యాపారాలకు సంబంధించిన లైసెన్స్లను రద్దు చేయాలని ఆదేశించారు. దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, రెస్టారెంట్లు ఇతర ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పట్ట ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని, ప్లాస్టిక్ నిషేధంపై పారిశుద్ధ్య వాహనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేయాలని, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు.

తురాటి గ్రామంలో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నర్సాపూర్(జి), జూలై 2 : మండలంలోని తురాటి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, డంపింగ్ యార్డు వద్ద చెత్త వేరుచేసే పనులను, గ్రామంలోని వార్డుల్లో బుధవారం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి, అంగన్వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని వార్డులతో పాటు డంపింగ్ యార్డు, శ్మశానవాటిను బైక్పై వెళ్ళి పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యంపీడీవో పుష్పలత, యంపీవో శ్రీనివాస్గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల నియమాకం

భైంసా, జూలై 3 : ఎంపీపీ, జడ్పీ పాలన ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను జిల్లాలోని 18 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలన ముగియడంతో పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. బుధవారం ఎంపీపీ, జడ్పీ పాలన ముగిసిన నేపథ్యంలో వీటిల్లో కూడా ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగనుంది. జిల్లాలోని 18 మండలాల ప్రత్యేకాధికారులు వీరే .....

సోన్ మండలానికి జడ్పీ సీఈవో గోవింద్, నిర్మల్ మండలానికి నిర్మల్ అర్డీవో రత్నకల్యాణి, సారంగపూర్ మండలానికి డీపీఏహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య, లక్ష్మణచాంద మండలానికి డీడబ్ల్యూఎంవో అర్.మోహన్, మామడ మండలానికి టీఎస్సీఎస్డీఎల్ డీఎం శ్రీకళ, కడం మండలానికి డీఆర్డీవో విజయలక్ష్మీ, ఖానాపూర్ మండలానికి సీపీవో పి.బాబురావ్, పెంబి మండలానికి ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జీ.వీ.నర్సింహరెడ్డి, దస్తూరాబాద్ మండలానికి డీఎస్సీడీవో రాజేశ్వర్గౌడ్, దిలావర్పూర్ మండలానికి జడ్పీ డిప్యూటీ సీఈవో డి.శంకర్, నర్సాపూర్ (జి) మండలానికి డీఏవో అంజీప్రసాద్, లోకేశ్వరం మండలానికి గ్రౌండ్వాటర్ జిల్లా అధికారి పి.శ్రీనివాస్బాబు, కుంటాల మండలానికి డీపీవో పి.శ్రీనివాస్, భైంసా మండలానికి అర్డీవో సీహెచ్ కోమల్రెడ్డి, కుభీర్ మండలానికి ఎస్సీసీవో ఈడీ మనోహర్, ముథోల్ మండలానికి డీసీఎస్వో నందిని, బాసర మండలానికి ఫిషరీస్ ఏడీ మధుసూదన్, తానూర్ మండలానికి మార్కెటింగ్ ఏడీ అశ్రఫ్ ఆహ్మద్లు నియమితులయ్యారు.

నేటి విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయండి

భైంసా, జూలై 3 : నీట్ పరీక్ష లీకేజీకి నిరసనంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే విద్యా సంస్థల బంద్ను విజయవంతం చేయాలని ఎస్ఎస్యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంజాద్ షేక్ పిలుపునిచ్చారు. బుధవారం సంబంధిత విషయంలో యూనియన్ శ్రేణులతో భైంసాలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైంది

- పదవిలో ఉన్నా లేకున్నా అనునిత్యం ప్రజల కోసం శ్రమిస్తా
- ఏడాది వేతనం 20 గ్రామ పంచాయతీల కార్మికులకు ఇస్తున్నా
- నిర్మల్ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి



గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్రెడ్డి

నిర్మల్ రూరల్, జూలై 3 : తాను ఎంపీపీ పదవి చేపట్టాక ఐదేళ్ల కాలం పాటు అందరి సహకారంతోనే నిర్మల్ మండలం అభివృద్ధి సాధ్యమైందని నిర్మల్ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సన్మాన, వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదేళ్ల పాటు తనకు సహకారాలు అందించిన రాజకీయ నాయకులకు, అధికారులకు, ఎంపీటీసీలకు, సర్పంచ్లకు వివిధ హోదాల్లో ఉన్న చైర్మన్లకు తన అనుచరులకు, అభిమానులకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనవంతు సహకారంగా తన ఒక సంవత్సరం వేతనాన్ని నిర్మల్ మండలంలోని 20 గ్రామ పంచాయతీల కార్మికులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక లక్ష 56 వేల రూపాయలను గ్రామ పంచాయతీ కార్మికులకు అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికులతోనే గ్రామాలన్నీ శుభ్రంగా ఉంటాయని వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించడానికి తాను పదవిలో ఉన్నా లేకపోయినా సహకరిస్తానన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేదుకు నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు, జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్కల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తానూ పదవిలో ఉన్నా లేకపోయినా నిరంతరం పేద ప్రజల కోసం శ్రమిస్తానని రామేశ్వర్ రెడ్డి అన్నారు. అనంతరం నిర్మల్ మండల ఎంపీటీసీలను, సర్పంచ్లను, కౌన్సిలర్లను, వివిధ శాఖల అధికారులను, తన అభిమానులను, అనుచరులను ఆయన ఘనంగా సన్మానించారు.

అప్పులబాధతో యువ రైతు మృతి



పెంబి రూరల్, జూలై 3 : అప్పుల ఆధతో యువ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యాపల్గూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... యాపల్గూడ గ్రామానికి చెందిన అర్క సంతోష్(28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేయగా భారీ వర్షం కారణంగా పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి కడెం వాగు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. విషయాన్ని గమనించిన కుటుబ సభ్యులు వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ తగాదాలో గాయపడిన వ్యక్తి మృతి

లోకేశ్వరం, జూలై 3 : ఇటీవల జరగిన భూ వివాదం ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. లోకేశ్వరం మండలంలోని హవర్గా గ్రామానికి చెందిన పర్స భోజన్న(54) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన సిందే లక్ష్మణ్ - గోదావరి దంపతులు గత నెల 24న దాడి చేశారు. ఆ సమయంలో తీవ్రంగా గాయపడిన భోజన్నను చికిత్స కోసం నిర్మల్కు తరలించగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మరణించినట్లు సమాచారం. కాగా దాడికి పాల్పడిన నిందితులను అదే రోజు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు.

నిషేధిత ప్లాస్టిక్ క్రయ, విక్రయాలపై మున్సిపల్ అధికారుల తనిఖీలు

భైంసా, జూలై 3 : పట్టణ పరిధిలో నిషేదిత ప్లాస్టిక్ క్రయ, విక్రయాలపై భైంసా మున్సిపల్ అధికారులు బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ ఇన్చార్జీ కమిషనర్ సీహెచ్ సుదర్శన్రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ అనీస్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పలు దుకాణాలలతో తనిఖీ నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

బాసర, జూలై, 3 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ను బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జీ.జానకీ షర్మిల సందర్శించారు. ఆకస్మికంగా క్యాంపస్కు వచ్చిన వీరు యూనివర్సిటీ ప్రాంగణమంతా తిరిగి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, వారి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరు పలు సూచనలు ఇచ్చారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. నిషేధిత, మత్తు పదార్థాల వంటి వాటికి దూరంగా ఉండాలని, వాటిని వినియోగిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వారి వెంట భైంసా ఏఎస్పీ అవినాష్కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్, తదితరులు ఉన్నారు.


ట్రిపుల్ ఐటీ క్యాంపస్ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

పంట బీమా, పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

నిర్మల్ అర్బన్ : పంట భీమా, పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంట భీమా, పంటల నమోదు కార్యక్రమం, సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ రకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల లభ్యత, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ మండల అభివృద్ధికి సహకరించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

దస్తురాబాద్, జూలై 3 : మండల అభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు సహకరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సింగరి కిషన్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదవులు శాశ్వతం కాదని, గెలిచిన ఓడిన ప్రజల పక్షాన ఉండి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అర్హులైన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసినందున వారికి శాలువాతో సన్మానం చేశారు. అంతకుముందు గొడిసిర్యాల్ గ్రామంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీపీసీ శారద శ్రీనివాస్, వైస్ ఎంపీపీ భూక్యారాజునాయక్, ఎంపీ డీవో రమేష్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, పీఏసీఎస్ చైర్మన్ రమేష్రావు, శైలజ, డిప్యూటీ తహసీల్దార్ యాదవ్రావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం ఇచ్చేంత వరకు కొట్లాడుతూనే ఉంటాం

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

లక్ష్మణచాంద, జూలై 3 : అర్హులైన తెలంగాణ ఆడపడుచులందరికీ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం డబ్బులు 1,00,116తో పాటు 1 తులం బంగారం వచ్చేంత వరకు కొట్లాడుతూనే ఉంటానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం క్రింద మంజూరైన చెక్కులను తల 1,00,116 చొప్పున 82 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటిపోయినా ఇప్పటికీ కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతుందన్నారు. అర్హులైన మహిళలకు రూ. 2500లు ఇవ్వలేదని, ఆసరాపెన్షన్ రూ. 4,000లకు పెంచలేదని, రైతుభరోసా అమలు చేయలేదని చాలా మంది అర్హులై ఉన్న జీరో బిల్లులు రాలేదని, రుణమాఫీ ఇంకా అమలు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందో ఆ హామీలన్నీ అమలయ్యేంత వరకు అసెంబ్లీలో కొట్లాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, తహసీల్దార్ జానకి, నాయకులు అయిండ్ల భూపాల్రెడ్డి, సరికెల గంగన్న, ఎర్ర ముత్యంరెడ్డి, స్థానిక ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచ్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మామడ : ప్రభుత్వం ఇచ్చిన హామీలను పేదింటి ఆడపిల్లలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మామడ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కోండ్ర రాజారెడ్డి, నాయకులు బాపురెడ్డి, ఎంపీటీసీ నవీన్కుమార్, చరణ్య జాలం, నాయకులు కిసాన్మోర్చా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి, నాయ కులు గోవర్ధన్రెడ్డి, చక్రపాణి, ఎంఆర్వో సుధాకర్, ఉప తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నిర్మల్ కల్చరల్ : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. నిర్మల్ అర్బన్, రూరల్, దిలావర్పూర్, నర్సాపూర్(జి) మండలాలకు చెందినవారు చెక్కులు అందుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎమ్మార్వోలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సాదం అరవింద్, నాయకులు పాల్గొన్నారు. సోన్లోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

భైంసా ఏఎస్పీగా అవినాష్ కుమార్ బాధ్యతల స్వీకరణ



భైంసా, జూలై 3 : భైంసా సబ్ డివిజన్కు ఏఎస్పీగా నూతనంగా నియమితులైన అవినాష్ కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. గ్రేహౌండ్స్ దళ కమాండర్గా విధులు నిర్వహిస్తున్న అవినాష్ కుమార్ బదిలీపై ఇక్కడి ఏఎస్పీగా వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఏఎస్పీగానున్న కాంతిలాల్ పాటిల్ బదిలీపై హైదరాబాద్ సౌత్ఈస్ట్ జోన్ డీసీపీగా వెళ్లారు. బుధవారం ఇక్కడ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అవినాష్ కుమార్ జిల్లా కేంద్రానికి వెళ్లి ఎస్పీ జానకీ షర్మిలను మర్యాద పూర్వకంగా కలిసారు.ఇరువురి మధ్య భైంసా సమస్యలు, తాజా పరిస్థితులపై చర్చించుకున్నారు. ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అవినాష్ కుమార్ బీహర్ రాష్ట్రం. ఐఐటీ రూర్కీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి 2021లో సివిల్స్లో ఐపీఎస్గా సెలెక్ట్ అయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం గ్రేహౌండ్ దళ కమాండర్గా విధులు నిర్వర్తించారు.తదుపరి ఇక్కడి ఏఎస్పీగా బదిలీ పై వచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

నిర్మల్ కల్చరల్, జూలై 3 : గురువారం సాయంత్రం 4 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు అదనపు బస్సుల అవసరం, సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు. 9959226003 నెంబర్కు ఫోన్ చేసి మాట్లాడవచ్చునని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిర్మల్ కల్చరల్, జూలై 3 : గాజులపేట్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ అంతరాయం కలుగనుంది. కొమ్ము నారాయణ రైస్ మిల్, ఎమ్మెల్యే నివాస ప్రాంతం, బైల్ బజార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు. మారెమ్మ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుండి 12 వరకు వివేక్ నగర్, శాంతి నగర్, శ్రీనగర్ కాలనీ, జర్నలిస్టుల కాలనీ, విద్యానగర్, మంచిర్యాల్ చౌరస్తా, చల్లి డాబా ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుంది.

బ్రాహ్మణ్గాం సబ్స్టేషన్ పరిధిలో..

ముథోల్, జూలై 3 : మండలంలోని బ్రాహ్మణ్గాం సబ్స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రాహ్మణ్గాం సబ్స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మిక సంఘంలో పలువురి చేరిక

నిర్మల్ కల్చరల్, జూలై 3 : పలు గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ మేస్త్రీలు, కూలీలను ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్లో బుధవారం చేర్చుకున్నట్లు జిల్లా నాయకులు పి. స్వదేశ్ తెలిపారు. పనిప్రదేశంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు.